సాక్షి
అనకాపల్లి

సోమవారం । 26 । మే । 2025



మళ్లీ కరోనా.. జర జాగ్రత్త

ప్రస్తుతం రాష్ట్రంలో కరోనా కేసులు కలవర పెడుతున్నాయి. అయినా ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు పాటించడం లేదు. 8లో

ఉష్ణోగ్రతలు

ఆదివారం

	గరిష్టం/కనిష్టం
అనకాపల్లి :	34.9/26.4



ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది(విశాఖ): సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం తగదు

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్



మునగపాక: కూటమి ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం విచారకరమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఎండీయూ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇంటింటికీ రేషన్ అందించేలా ఎండీయూ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తే, ఇప్పటి ప్రభుత్వం ఈ పథకానికి మంగళం పాడడం సరికాదన్నారు.సీఎం చంద్రబాబునాయుడుకు చిత్తశుద్ధి ఉంటే కేరళలో మాదిరిగా 16 రకాల నిత్యావసర సరకులను పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి ఎండీయూ వ్యవస్థ కొనసాగేలా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో 2027 వరకు ఒప్పందం ఉన్నప్పటికీ ఇప్పటికిప్పుడు రద్దు చేయడం తగదన్నారు.ప్రజలంతా కూటమి పాలన తీరును గమనిస్తున్నారని ఆయన తెలిపారు.

గందరగోళంగా ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ

- ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు

నర్సీపట్నం: ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ చాలా గందరగోళంగా ఉందని ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. నర్సీపట్నం వచ్చిన సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బదిలీలు ప్రశాంతమైన వాతావరణంలో జరగాలంటే రేషనలైజేషన్ ప్రక్రియతో ముడి పెట్టకూడదని చెప్పారు. ఒకసారి రేషనలైజేషన్ జరిగిన తర్వాత కనీసం ఐదేళ్ల వరకు ఉపాధ్యాయులను కదపకూడదన్నారు. ఐదేళ్ల తర్వాత మాత్రమే రేషనలైజేషన్ ప్రక్రియ జరపాలని తెలిపారు. అలా అయితేనే విద్యార్థుల సంఖ్య పెంచే అవకాశం ఉపాధ్యాయులకు కలుగుతుందని చెప్పారు. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు రెండు సంవత్సరాలకు రెండు పాయింట్లు అదనంగా ఇవ్వాలన్నారు. 2021లో బదిలీపై వచ్చి 2025లో రేషనలైజేషన్ గురైన ఉపాధ్యాయులకు కూడా పాత స్టేషన్ పాయింట్లు ఇవ్వాల ని కోరారు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా డీఎస్సీలో సెలెక్ట్ అయిన ఉపాధ్యాయులకు సర్వీసు పాయింట్లు ఇవ్వాలన్నారు. బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్లో తలెత్తిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. నర్సీపట్నం మండలంలో ఫౌండేషన్ స్కూళ్లుగా ఉన్న శ్రీరాంపురం, గచ్చపు వీధి పాఠశాలలను తిరిగి బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చి, ఆ ప్రాంత విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని విద్యాశాఖాధికారులను కోరారు. విలేకరుల సమావేశంలో ఉమ్మడి జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు డి.గోపీనాథ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు మద్దు శ్రీను, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ, రాష్ట్ర కార్యదర్శి జి.పి.ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు



ఏవీఎన్‌కాలేజీలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

మహారాణిపేట(విశాఖ): విశాఖ జిల్లాలో ఆదివారం నిర్వహించిన యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ (యూపీఎస్సీ)సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ ప్రశాంతంగా నిర్వహించారు. ఈ పరీక్షల కోసం జిల్లా యంత్రాంగం పలు ఏర్పాట్లు చేసింది. మొత్తం 8,422 మంది విద్యార్థులకు కోసం 19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి సెషన్ పరీక్షకు 8,422 మందిలో 4,523 మంది పరీక్షకు హాజరయ్యారు. రెండో సెషన్ పరీక్షకు(మధ్యాహ్నం) 8,422 మందికి 4.496 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ పరీక్ష నిర్వహణ కోసం ఇద్దరు పరిశీలకులను నియమించారు. యూపీపీఎస్ నుంచి ఒక పరిశీలకుడుగా డైరెక్టర్ పట్నాయక్‌ను, రాష్ట్ర పరిశీలకులుగా సీనియర్ ఐఎస్ఎస్ అధికారి అహ్మద్ బాబు, జిల్లా కో ఆర్డినేటర్ మయూర్ అశోక్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షల నేపథ్యంలో విశాఖ కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ స్థానికంగా ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను సందర్శించి, ఏర్పాట్లను సమీక్షించారు.

కోళ్ల వ్యర్థాలతో రూ.కోట్లు

యథేచ్ఛగా రవాణా



యలమంచిలిలో ఆదివారం తరలిస్తున్న కోడి మాంసం వ్యర్థాలు

ప్లాస్టిక్ డ్రమ్ములో చికెన్ వ్యర్థాలు



చికెన్ వ్యర్థాలను చెరువులో వేస్తున్న దృశ్యం



చేపలకు ఆహారంగా వేసిన చికెన్ వ్యర్థాలు

- చేపలకు మేతగా చికెన్ వ్యర్థాలు
- భారీగా ఆర్జిస్తున్న అక్రమార్కులు
- ప్రమాదంలో ప్రజారోగ్యం, పర్యావరణం
- కేసులు నమోదు చేయాలని డీజీపీ, ఎస్పీ తాజా ఆదేశాలు
- ఫిర్యాదులున్నా పట్టించుకోని అధికారులు

యలమంచిలి రూరల్: జిల్లాలో కోడి మాంసం వ్యర్థాల వ్యాపారం అక్రమార్కులకు రూ.కోట్లు కురిపిస్తోంది. వీటి సేకరణ,అక్రమ రవాణాపై 2016లోనే రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించినా, నిత్యం ప్రత్యేక వాహనాలతో వందలాది డ్రమ్ముల కోళ్ల వ్యర్థాలను వ్యాపారులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇలా అక్రమంగా రవాణా చేస్తున్న కోడి మాంసం వ్యర్థాలను చేపలకు మేతగా వేస్తున్నారు. చికెన్ వ్యర్థాలను మేతగా తింటున్న చేపలు తక్కువ కాలంలో ఎదుగుతున్నాయి. ఈ చేపల్ని తింటున్న ప్రజలు వివిధ రకాల అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా చికెన్ వ్యర్థాలను సక్రమంగా నిర్వహించకపోవడంతో పర్యావరణానికి సైతం హానికలుగుతోంది.రాష్ట్ర వ్యాప్తంగా చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు, వీటిని రవాణా చేస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వాహనాలను సీజ్ చేయాలని ఈ నెల 16న డీజీపీ కార్యాలయం నుంచి ఎస్పీలకు,ఈ నెల 21న అనకాపల్లి ఎస్పీ నుంచి జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.అయినప్పటికీ ఈ నెల 25వ తేదీన కూడా యలమంచిలి,అనకాపల్లి,అచ్యుతాపురం,నక్కపల్లి,అడ్డరోడ్డు,నర్సీపట్నం, చోడవరం,పాయకరావుపేట సహా జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాలు,మేజర్ పంచాయతీల నుంచి కోడి మాంసం వ్యర్థాల అక్రమ రవాణా యథేచ్ఛగా జరగడం గమనార్హం. తమ కళ్లముందే కోడి మాంసం వ్యర్థాలను డ్రమ్ముల్లో వేసి తరలించుకుపోతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మిగతారోజులతో పోల్చితే ఆదివారం కోడి మాంసం వ్యర్థాలు ఎక్కువగా వస్తాయి.ఇది తెలిసినా వివిధ శాఖల అధికారులు మాత్రం తమకెందుకులే అన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు. అక్రమ ఆర్జనకు అలవాటుపడిన వ్యాపారులు మమ్మల్ని ఎవడ్రా ఆపేది అన్నట్టు దర్జాగా వాహనాల్లో చికెన్ వ్యర్థాలను తరలించుకుపోతున్నారు.

నెలకు 2వేల టన్నుల కోళ్ల దిగుమతి

జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో సుమారు 2,100 వరకు కోడి మాంసం విక్రయ కేంద్రాలున్నాయి. నిత్యం 60 టన్నుల కోళ్ల,ఆదివారం ఒక్కరోజే 100 నుంచి 120 టన్నుల కోళ్లను చికెన్ షాపుల నిర్వాహకులు దిగుమతి చేసుకుంటున్నారు.ప్రతి నెల సుమారు 2వేల టన్నుల వరకు కోళ్లు దిగుమతి అవుతున్నాయి.చికెన్ షాపుల్లో మాంసం విక్రయించగా మిగతా చర్మం,పేగులు,కాళ్లు,ఇతర వ్యర్థాలను షాపుల నిర్వాహకుల దగ్గర్నుంచి కిలో రూ.3 నుంచి రూ.5 వరకు కొందరు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పెద్ద షాపుల నిర్వాహకుల నుంచి వ్యర్థాలను కొనుగోలు చేస్తుండగా,చిన్న దుకాణాల నిర్వాహకులు ఉచితంగానే అందజేస్తున్నారు.ఇలా సేకరించిన చికెన్ వ్యర్థాలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని చేపల చెరువుల వ్యాపారులకు కిలో రూ.15 నుంచి రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు.కొందరు చేపల చెరువుల వ్యాపారులే నేరుగా చికెన్ వ్యర్థాలను డ్రైవర్లు,సహాయకులను నియమించుకుని తరలిస్తున్నారు.ఒక కిలో కోడి మాంసం నుంచి సుమారు 250 నుంచి 300 గ్రాముల చికెన్ వ్యర్థాలు వస్తాయి.జిల్లాలో ప్రతి నెలా దిగుమతి చేసుకుంటున్న కోళ్ల ద్వారా 600 టన్నుల వరకు వ్యర్థాలు వస్తున్నాయి. వ్యాపారులు ఒకసారి వాహనంలో 9 డ్రమ్ముల వ్యర్థాలు తీసుకెళ్తున్నారు.ఒక్కో డ్రమ్ములో 150 నుంచి 200 కిలోల వరకు చికెన్ వ్యర్థాలు ఉంటున్నాయి. ఒకసారి వాహనంలో చికెన్ వ్యర్థాలను తరలిస్తే ఆ వ్యాపారికి అన్ని ఖర్చులూ మినహాయించుకుంటే రూ.18వేల నుంచి రూ.20వేల వరకు ఆదాయం వస్తోంది.ఈ లెక్కన నెలకు రవాణా అవుతున్న 2వేల టన్నుల చికెన్ వ్యర్థాలతో సుమారు రూ.60 లక్షల వరకు ఆదాయాన్ని ఈ అక్రమ వ్యాపారం ద్వారా కొందరు సంపాదిస్తున్నారు. ఏటా రూ.7 కోట్లపైనే వెనకేసుకుంటున్నారు.

వ్యర్థాల రవాణా నిషేధం



చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా,చేపలకు మేతగా వినియోగించడాన్ని నిషేధిస్తూ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ,మత్స్య శాఖలు 2005లో జీవో ఎంఎస్ 54, 2016లో జీవో ఎంఎస్ 56లను విడుదల చేశాయి.చికెన్ వ్యర్థాల రవాణాను కట్టడి చేయడానికి మండల స్థాయిలో తహసీల్దార్ చైర్మన్‌గా,వీఆర్వో,రవాణా, స్థానిక పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సభ్యులుగా,మత్స్య అభివృద్ధి అధికారి మెంబర్ కన్వీనర్‌గా కమిటీని నియమించారు.అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా నిరాటంకంగా సాగుతోంది. నెల రోజుల క్రితం కొందరు మీడియా ప్రతినిధులు యలమంచిలి పట్టణంలో చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని ఆపితే.. వాహనాన్ని ఆపే అధికారం మీకు లేదని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని సదరు వ్యాపారి మీడియా ప్రతినిధులనే తిరిగి బెదిరించేలా మాట్లాడడం వెనుక అంతర్యాన్ని అర్థం చేసుకోవచ్చు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా చికెన్ వ్యర్థాలను వ్యాన్లలో తరలిస్తున్నా ఎవరూ ఏమీ చేయలేని నిస్సహాయస్థితి నెలకొంది. నిత్యం చికెన్ వ్యర్థాల వాహనాలు వెళ్తుంటే ముక్కుపుటాలు అదిరేలా వచ్చే దుర్వాసనను ప్రజలు భరించాల్సిన దుస్థితి ఉంటోంది.

డీజీపీ,ఎస్పీ ఆదేశాలు బేఖాతర్

చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా,వాటిని చెరువుల్లో చేపలకు మేతగా ఉపయోగించడాన్ని సీరియస్‌గా పరిగణించిన రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆదేశాలతో గత మార్చి నెలాఖరులో రాష్ట్రవ్యాప్తంగా మెరుపుదాడులు నిర్వహించి, చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలు, అందుకు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల ఎస్పీలు,నగరాల సీపీలకు ఆదేశాలు వచ్చాయి. చికెన్ వ్యర్థాలు వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం పడడంతో పాటు,పర్యావరణం ,పరిశుభ్రత దెబ్బతింటాయని, చట్టపరమైన నిబంధనలను అతిక్రమిస్తున్న అక్రమార్కులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. చికెన్ వ్యర్థాలను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై ఏపీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయవచ్చో స్పష్టంగా తెలియజేశారు.ఈ ఆదేశాలకు అనుగుణంగా వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ తుహిన్ సిన్హా జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లకు ఈ నెల 21న మెమో పంపారు. పోలీసు ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాలను సైతం క్షేత్రస్థాయిలో యంత్రాంగం బేఖాతరు చేస్తోంది.ఆదివారం జిల్లా వ్యాప్తంగా చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా మామూలుగానే జరగడం దీనికి నిదర్శనం. ఇప్పటి వరకు చికెన్ వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న వ్యాపారులపై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. ఒక్క వాహనాన్ని కూడా అధికారులు సీజ్ చేయలేదు. పోలీసు,ఇతర శాఖల ఉన్నతాధికారుల ఆదేశాలే క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలుకాకపోవడంతో సామన్య ప్రజలు తమ కళ్లెదురుగా చికెన్ వ్యర్థాల రవాణా జరగడం చూస్తున్నా ఫిర్యాదు చేయడానికి సైతం వెనకాడే పరిస్థితులు ఉంటున్నాయి.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు



యలమంచిలి నియోజకవర్గంలో చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 19న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను.చికెన్ వ్యర్థాలను అక్రమంగా తరలించి పక్క జిల్లాల్లోని చెరువుల్లో చేపలకు మేతగా ఉపయోగిస్తున్నారు.ఇది ప్రజారోగ్యానికి చాలా హానికరం.నేనిచ్చిన ఫిర్యాదుకు జవాబుగా చర్యలు తీసుకున్నట్టు జిల్లా మత్స్యశాఖాధికారి నుంచి సమాచారం వచ్చింది. అయితే ఆదివారం యలమంచిలిలో యథావిధిగా చికెన్ వ్యర్థాలను తరలించారు. దీనికి సంబంధించి ఫొటోలు,వీడియోలను జిల్లా మత్స్య శాఖాధికారికి వాట్సాప్ ద్వారా పంపించాను.స్పందన లేదు.అధికారుల చర్యలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి.చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా పూర్తిగా కట్టడి చేయడానికి కచ్చితమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జిల్లా ఉన్నతాధికారులపై ఉంది.

– చాకలి నూకరాజు, ఆర్టీఐ కార్యకర్త,జంపపాలెం

కఠిన చర్యలు తీసుకుంటాం

జిల్లాలో చికెన్ వ్యర్థాల అక్రమ రవాణాను కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకుంటాం.అన్ని శాఖల అధికారులతో టాస్క్‌ఫోర్స్ కమిటీలు వేసుకుని రహదారులపై చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచుతాం.చికెన్ వ్యర్థాలను చేపలకు మేతగా వేయడాన్ని ప్రభుత్వం నిషేధించింది.చికెన్ వ్యర్థాలతో పెరిగిన చేపలు తినడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. ఎస్పీతో చర్చించి చికెన్ వ్యర్థాల అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటాం.

– వి.ప్రసాద్, జిల్లా మత్స్యశాఖాధికారి,అనకాపల్లి

యోగాంధ్రను విజయవంతం చేయాలి



యోగా చేస్తున్న ట్రైనర్లు

కలెక్టర్ విజయ కృష్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని, దీనిలో మాస్టర్ ట్రైనర్ల పాత్ర కీలకమని కలెక్టరు విజయ కృష్ణన్ అన్నారు. స్థానిక గవరపాలెం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో రెండో రోజు ఆదివారం జరిగిన యోగా మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ తీసుకున్న ట్రైనర్లు గ్రామాల్లో కనీసం 50 మందికి తక్కువ కాకుండా యోగా నేర్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్ర యాప్‌లో నమోదు కావాలని, ప్రజలు పెద్దఎత్తున యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యే విధంగా అవగాహన, ప్రచారం కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగా చేసేవిధంగా ప్రోత్సహించాలని, యోగాతో ఆరోగ్యం లభిస్తుందని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి కె.మనోరమ, జిల్లా ఆయుష్ అధికారి కె.లావణ్య, యోగా మాస్టరు ట్రైనర్లు పాల్గొన్నారు.

యోగాంధ్రతో మభ్యపెడుతున్న కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

మునగపాక: యోగాంధ్ర పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి ఆరోపించారు.మండలంలోని తిమ్మరాజుపేట డావెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో రెండవ రోజు జరిగిన మహిళా చైతన్య శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు.ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని చెప్పారు.ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే యోగాంధ్ర కార్యక్రమాన్ని తెరపైకి తీసుకువస్తున్నారన్నారు.కడపలో మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి చేసి, హత్య చేస్తే సీఎం చంద్రబాబు,హోంమంత్రి అనిత స్పందించకపోవడం విచారకరమన్నారు.రాష్ట్రంలో మహిళలపైనా, చిన్నారులపైనా ఇటువంటి ఘటనలు అధికంగా జరుగుతున్నా పట్టించుకోకపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు ప్రభావతి మాట్లాడుతూ ఎన్నికల హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమికి గుణపాఠం తప్పదని తెలిపారు. హక్కులను కాపాడుకునేందుకు మహిళలు రాజీలేని పోరాటం చేయాలన్నారు.ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, ప్రధాన కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, ఆర్.లక్ష్మి,వాణి, జి.సుభాషిణి, సీహెచ్ మంగతాయారు, సత్యవతి,గౌరీ, సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చిక్కులు.. గురువులకు తిప్పలు

విశాఖ జిల్లా, గోపాలపట్నంలోని ఇందిరానగర్ స్కూల్ టీచర్‌కు స్టేషన్ సీనియార్టీ ఈ ఏడాది ఆగస్టుకు ఎనిమిదేళ్లు నిండుతాయి. కానీ, తప్పనిసరి బదిలీ జాబితాలో ఆమె పేరు చేర్చారు. సీనియార్టీ పాయింట్లు మాత్రం ఏడేళ్లకే ఇచ్చారు. దరఖాస్తు సమయంలో లీగల్లీ సెపరేట్‌కు 5 పాయింట్లు నమోదు చేసినా, ఫైనల్ జాబితాలో అవి యాడ్ కాలేదు. డీఈవో కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసినా.. సమస్యకు పరిష్కారం లభించలేదు.

విశాఖ నగరంలోని బుచ్చిరాజుపాలెంలో జీవీఎంసీ యూపీ స్కూల్‌ది మరో చిత్రం. ఇక్కడ స్థానికుల ఒత్తిడి మేరకు ఈ స్కూల్‌ను సమీప హైస్కూల్లో విలీనం చేయకుండా యూపీ స్కూల్‌గా కొనసాగిస్తున్నారు. ఇక్కడ 6, 7, 8 తరగతుల విద్యార్థులు 140 వరకు ఉన్నారు. ఒక్క స్కూల్ అసిస్టెంట్‌ను మాత్రమే ఇచ్చి, మిగతా పోస్టులు మిగులు టీచర్లు(సర్‌ప్లస్)గా చూపించారు. ఇక్కడ ఎస్జీటీలతో హైస్కూల్ పాఠాలు చెప్పిస్తారా? అని డౌట్..!

ఈ రెండు ఉదాహరణలు చాలు ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో గందరగోళం ఏ స్థాయిలో ఉందో తెలుసుకునేందుకు..!

- కొనసాగుతున్న బదిలీల గందరగోళం
- సర్వీస్ పాయింట్ల లెక్కతేలక అయోమయం
- సాంకేతిక సమస్యలతో దరఖాస్తుకు ఇబ్బందులు



విశాఖలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

విశాఖ విద్య: టీచర్ల బదిలీల్లో ఆన్‌లైన్ దరఖాస్తులు ఓ ప్రహసనంగా మారాయి. సర్వీసు పరమైన వివరాలు సవ్యంగా నమోదుకాక తీవ్రంగా నష్టపోతున్నారు. దరఖాస్తు సమయంలో వెబ్‌సైట్‌లో చూపిస్తున్న వివరాలకు భిన్నంగా ఫైనల్ జాబితాలో చూపిస్తుండటంతో ఏ మారుమూలకు కొట్టుకుపోతామోనని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

ఖాళీలపై స్పష్టతేదీ?

బదిలీల నేపథ్యంలో క్లియర్ వేకెన్సీ, 5/8 లాంగ్ స్టాండింగ్ వేకెన్సీల ప్రకటనలో జిల్లా విద్యాశాఖ నుంచి ఇప్పటికీ స్పష్టత లేదు. తొలుత 4,788 ఖాళీలు ప్రకటించారు. ఆ తర్వాత 4,811గా బయటకు లీకులిచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో మళ్లీ దీనిపై కసరత్తు చేశారు. ఇదంతా తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది

యూపీ స్కూళ్లలో పోస్టులు మాయం

ప్రాథమికోన్నత(యూపీ) పాఠశాలల్లో పోస్టుల కోతను ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజల కోరిక మేరకు, డిమాండ్ ఉన్న చోట యూపీ స్కూళ్లను కొనసాగిస్తున్నట్లు చెప్పిన కూటమి ప్రభుత్వం, లోపాయికారీగా వాటిని నిర్వీర్యం చేస్తోంది. కొత్తగా జిల్లా విద్యాశాఖ చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియ ఈ అనుమానాలకు బలం చేకూర్చుతోంది.

మోడల్ స్కూల్ హెచ్‌ఎంలు ఎవరో..

ఉమ్మడి విశాఖ జిల్లాలో 565 మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. రేషనలైజేషన్‌లో భాగంగా మిగిలిన 277 మంది స్కూల్ అసిస్టెంట్లను వీటికి హెచ్‌ఎంలుగా నియమిస్తామని తొలుత ప్రకటించారు. కానీ, బదిలీల సమయంలో దీనిపై స్పష్టత లేకపోవటంతో అంతా అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ల బదిలీ దరఖాస్తుకు ఆదివారంతో గడువు ముగిసింది. త్వరలోనే వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలి. దీనిపై ఇప్పటి వరకు స్పష్టత లేకపోవటంతో సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాబితాల తయారీకి తలనొప్పులు

బదిలీల నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు వెబెక్స్ సమీక్షల పేరుతో రోజుకో ఆదేశం ఇస్తున్నారు. ఆ మేరకు సీనియార్టీ జాబితాలను తయారు చేసేందుకు జిల్లా విద్యాశాఖ సిబ్బంది తర్జనభర్జనలు పడుతున్నారు. క్షణానికో ఉత్తర్వుతో కేడర్ల వారీగా జాబితాల నమోదులో జాప్యం నెలకొంటోంది. దీంతో సాంకేతిక సమస్యల పరిష్కారం పేరిట నగరంలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. దీని వల్లనైనా తమ ఇబ్బందులు పరిష్కరిస్తే చాలని గురువులు కోరుకుంటున్నారు.

క్లుప్తంగా

సైనికులకు సంఘీభావంగా తిరంగా యాత్ర ర్యాలీ



కశింకోటలో మాజీ సైనికోద్యోగులు, నాయకులు, స్థానికులు తిరంగా యాత్ర ర్యాలీ

కశింకోట: ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించిన సైనికులకు సంఘీభావంగా కశింకోటలో మాజీ సైనికోద్యోగులు, నాయకులు, అభిమానులు తిరంగా యాత్ర ర్యాలీని ఆదివారం నిర్వహించారు. జాతీయ పతాకాలతో స్థానిక పెద బజారు నుంచి ప్రారంభించిన ప్రదర్శన సంత బయల మీదుగా జాతీయ రహదారి కూడలి వరకు ప్రధాన పంచాయతీ రహదారి మీదుగా సాగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ సైనికోద్యోగుల సంఘం అధ్యక్షుడు గొంతిన రమణ, నాయకులు దాసరి బాబు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, ప్రగడ నూకరాజు, శిష్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మీజిల్స్, రుబెల్లా టీకాల ప్రత్యేక డ్రైవ్

మహారాణిపేట(విశాఖ): జిల్లాలో మీజిల్స్, రుబెల్లా వంటి ప్రమాదకరమైన వైరల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సోమవారం నుంచి ప్రత్యేక టీకాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మూడు నెలల పాటు కొనసాగే ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో వచ్చే న్యుమోనియా, విరేచనాలు, మెదడు వాపు వంటి తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. రుబెల్లా వైరస్ గర్భిణులకు సోకితే పుట్టబోయే పిల్లల్లో చెవుడు, చూపు లోపం, గుండె సంబంధిత లోపాలు వంటి జన్యుపరమైన సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యాధుల నుంచి పిల్లలను రక్షించడానికి భారత ప్రభుత్వం యూనివర్సల్ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం కింద రెండు డోసుల టీకాలను అందిస్తోంది. మొదటి డోసు 9 నుంచి 12 నెలల మధ్య, రెండవ డోసు 16 నుంచి 24 నెలల మధ్య వేయాల్సి ఉంటుంది. 2026 నాటికి మీజిల్స్, రుబెల్లాను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ప్రత్యేక టీకాల డ్రైవ్ మూడు రౌండ్లలో కొనసాగుతుంది. మొదటి రౌండ్ ఈ నెల 26 నుంచి 31 వరకు, రెండవ రౌండ్ జూన్ 23 నుంచి 28 వరకు, మూడవ రౌండ్ జూలై 21 నుంచి 26 వరకు కొనసాగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ బి.లూసీ కార్డిలియా తెలిపారు. ప్రతి ఒక్క బిడ్డకు టీకాలు వేయడం ద్వారా 2026 నాటికి మీజిల్స్,రుబెల్లా నిర్మూలన లక్ష్యాన్ని చేరుకోగలమని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా వైద్య ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

నేడు 'ఉక్కు' చర్చలు

ఉక్కునగరం: కేంద్ర కార్మిక శాఖ రీజనల్ లేబర్ కమిషనర్(ఆర్‌ఎల్‌సీ) సోమవారం స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు, ఉక్కు యాజమాన్యం, కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 16న జరిగిన చర్చలు విఫలం కావడంతో సమావేశాన్ని వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ నెల 20 నుంచి స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మె చేస్తుండటంతో ఈ చర్చలు కీలకంగా మారనున్నాయి.

మళ్లీ కరోనా.. జర జాగ్రత్త



కాయగూరల మార్కెట్‌లో గుంపుగా తిరుగుతున్న ప్రజలు

- జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు ఉంటే హోం ఐసోలేషన్ తప్పనిసరి
- ముందస్తుగా ఎన్టీఆర్ ఆస్పత్రిలో 10 బెడ్లు సిద్ధం
- కరోనా చికిత్సపై ప్రభుత్వం నుంచి విడుదల కాని మార్గదర్శకాలు

అనకాపల్లి టౌన్: కరోనా మహమ్మారి ప్రపంచాన్నే గడగడలాడించిన వ్యాధి. దీని బారిన ఇంచుమించుగా ప్రతి ఒక్కరూ పడ్డారనే చెప్పొచ్చు. కొంత మంది ప్రాణాలను సైతం పోగట్టుకున్నారు. మరికొంత మంది చావు దగ్గరకు వెళ్లి ప్రాణాలతో బయట పడ్డారు. ఈ మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో కరోనా కేసులు కలవరపెడుతున్నాయి. అయినా ప్రజలు ఎటువంటి జాగ్రత్తలు పాటించడం లేదు. ప్రభుత్వం నుంచి కూడా ఎటువంటి మందస్తు హెచ్చరికలు రాలేదు. మరోవైపు అశ్రద్ధ వహిస్తే భారీ మూల్యం చెల్లించుకోకతప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు ఉంటే హోం ఐసోలేషన్ తప్పనిసరని సూచిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఐదు కేసులు

తెలుగు రాష్ట్రాల్లో చాపకింద నీరులా కరోనా వ్యాపిస్తోంది. మూడు రోజుల క్రితం విశాఖపట్నంలో తొలి కరోనా కేసు నమోదు కాగా, తర్వాత ఒకటి, కడపలో రెండు కేసులు నమోదయ్యాయి. తెలంగాణాలో కూకట్‌పల్లిలో ఓ డాక్టర్‌కు కరోనా పాజిటివ్ అని తేలింది. ఇప్పటికే పలు దేశాలలో వైరస్ పలు వేరియంట్‌లతో విజృంభిస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.

పట్టణంలో యథేచ్ఛగా..

పట్టణంలో జనం యథేచ్ఛగా తిరుగుతున్నారు. ప్రజలు వ్యాధి బారిన పడకుండా ప్రభుత్వం ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోవడం లేదు. ఆదివారం కావడంతో ఫిష్, చికెన్, మటన్ మార్కెట్‌లు కిటకిటలాడాయి. సామాజిక దూరం పాటించకుండా గుంపులుగా తిరుగుతున్నారు.

వ్యాధి లక్షణాలు..

పొడి దగ్గు, గొంతు నొప్పి, జ్వరం శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రుచి, వాసన గుర్తించలేకపోవడం మొదలైనవి.



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో గుంపులుగా ఉన్న ప్రయాణికులు

జాగ్రత్తలు..

వ్యాధి లక్షణాలు గమనిస్తే వెంటనే సమీపంలోని ఉన్న పీహెచ్‌సీ, ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి తెలియజేయాలి. వారి ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. చేతులపై ఉన్న హాని కారక క్రిములను తొలగించుకోవడానికి శాస్త్రీయమైన పద్ధతిలో చేతులను తరచుగా శుభ్రం చేసుకోవాలి. సబ్బు నీరు, ఆల్కహాల్ శానిటైజర్లను ఉపయోగించుకొని చేతులను ఎప్పటికప్పుడు రుద్దుకోవాలి. చేతులతో ముఖం, నోరు, కళ్లు, ముక్కును తాకరాదు. బహిరంగ ప్రదేశాలలో, పని ప్రదేశాలలో తప్పనిసరిగా ఫేస్ మాస్క్ ధరించాలి. అత్యవసరమైతేనే ఆస్పత్రులకు వెళ్లాలి. వీలైనంత వరకు ఇంటి వద్దనే ఉండాలి. ఎక్కడా గుంపులుగా ఉండరాదు. ప్రతి ఒక్కరూ సామాజిక దూరం పాటించాలి.

ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం..



కరోనా కేసులు మళ్లీ వ్యాపిస్తున్న తరుణంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి. తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆస్పత్రిలో ఇప్పటికే 10 బెడ్స్‌ను సిద్ధం చేశాం. ఆక్సిజన్ సిలెండర్లు, మందులు కూడా అందుబాటులో ఉంచాం. ముఖ్యంగా ప్రజలందరూ సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. బయటకు వెళ్తే మాస్క్ తప్పనిసరిగా వాడాలి. ప్రభుత్వం అధికారికంగా ఎటువంటి మార్గదర్శకాలు జారీ కాలేదు.

– ఎస్.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, ఎన్టీఆర్ వైద్యాలయం, అనకాపల్లి

ఉరేసుకుని యువకుడి మృతి



రాము (ఫైల్)

ఎస్.రాయవరం: కుటుంబ కలహాలతో చెట్టుకు ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ధర్మవరం అగ్రహారంలో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు అందించిన వివరాల ప్రకారం.. కోటవురట్ల మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన మంచాల రాము(35) గత రాత్రి ధర్మవరం అగ్రహారం సమీపంలో జాతీయ రహదారికి ఆనుకున్న చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఏఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని జేబులో ఉన్న ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడు మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో నిత్యం గొడవలు పడేవాడు. ఈ నేపథ్యంలో మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

భార్య, కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు



కుమార్తెతో దాసరి లలిత(ఫైల్)

మునగపాక: మండలంలోని ఒంపోలుకు చెందిన వివాహితతో పాటు రెండేళ్ల పాప కనిపించలేదంటూ అందిన ఫిర్యాదు మేరకు మునగపాక పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఒంపోలుకు చెందిన దాసరి సన్యాసినాయుడు భార్య లలిత అచ్యుతాపురం బ్రాండిక్స్‌లో పని చేస్తుంది. ఈ నెల 24న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అదే రోజు డ్యూటీకి వెళ్లిన లలిత రాత్రికి ఇంటికి చేరుకోకపోవడంతో కంగారుపడి బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం సన్యాసినాయుడు మునగపాక పోలీసు స్టేషన్‌లో తన భార్య లలితతో పాటు రెండేళ్ల కుమార్తె రియాన్సీ కనిపించలేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెరిగిన కోనాం నీటిమట్టం



కోనాం జలాశయం

చీడికాడ: మండలంలోని కోనాం జలాశయం నీటిమట్టం రోజురోజుకు పెరుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు జలాశయంలోకి ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 95.90 మీటర్లు వద్ద ఉంది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 30 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 30 క్యూసెక్కులుగా నమోదై ఉంది. గతేడాది ఇదే సమయంలో జలాశయం నీటిమట్టం 95.60 మీటర్లు వద్ద ఉంది.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



సమీర్ మృతదేహం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్‌లో ఆదివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లిన సమీర్(26) నీటిలో మునిగి చనిపోయాడు. మారికవలసకు చెందిన సమీర్‌కు ఈత రాదు. అయితే ఐదుగురు వ్యక్తులతో కలిసి రిజర్వాయర్‌లో దిగిన సమీర్ ఈ ప్రమాదానికి గురయ్యాడు. ఎన్డీఆర్‌ఎఫ్ బృందంతో పాటు తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమీర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన తండ్రి ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ వాసునాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక ఊర్వశీ కూడలిలోని గౌరీ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సోమవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్‌రావు, కరస్పాండెంట్ పి.ఎస్. నాయుడు ఆదివారం తెలిపారు. స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళా జరగనుంది. మొత్తం 12 కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొని సుమారు 1840 ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. టెన్త్ నుంచి డిగ్రీ, ఐటీఐ, బీ.టెక్, ఫార్మసీ (డీ, బీ, ఎం) పూర్తిచేసిన అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో సోమవారం ఉదయం 9 గంటల నుంచి కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని నిర్వాహకులు సూచించారు.

నేల బావిలో పడి విద్యార్థి మృతి



సాయి గణేష్(ఫైల్)

నక్కపల్లి: మండలంలో జగన్నాథపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి ఆదివారం నేలబావిలో పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన జగతా గంగాద్రి సాయి గణేష్(16) తమ పశువులను మేత కోసం పొలంలోకితీసుకెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో దాహం వేయడంతో సమీపంలో ఉన్న నేలబావి వద్దకు వెళ్లి డొక్కుతో నీరు తోడుతుండగా ప్రమాదవశాత్తూ పడిపోయాడు. సమీపంలో ఉన్న వారు గమనించి కేకలు వేసి బావిలో పడిపోయిన సాయిగణేష్‌ను బయటకు తీసి హుటాహుటిన నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మరణించినట్లు వైద్యులు తెలిపారు. సాయిగణేష్ ఇటీవలే పదో తరగతి పాసయ్యాడు. ఈ ఘటనపై మృతుడు తండ్రి జగతా శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు.

జయహో భారత్



త్రివర్ణ బెలూన్‌లను ఎగురవేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఏయూ క్యాంపస్: భారత త్రివిధ దళాల శక్తిని కీర్తిస్తూ ఆదివారం బీచ్‌రోడ్డులో టార్చ్ లైట్ ర్యాలీ జరిగింది. ఈవెంట్ మేనేజర్స్ అసోసియేషన్ విశాఖ కేంద్రం ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. పాకిస్థాన్‌పై భారత త్రివిధ దళాల సైనికుల వీరోచిత పోరాటాన్ని కీర్తిస్తూ వేదికపై నృత్య రూపకాలు ప్రదర్శించారు. ఆ తర్వాత టార్చ్ లైట్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్ కుమార్, కార్యదర్శి షరీఫ్ ఖాన్, ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్ మోహన్, వైజాగ్ హోటల్స్ అసోసియేషన్ కార్యదర్శి పవన్ కార్తీక్, ఈవెంట్ మేనేజర్లు మీనాక్షి అనంత రామన్, అజయ్ అగర్వాల్, దాడి రవికుమార్, ఎస్.ఆర్.కె.బాబూరావు, జయచంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

దీర్ఘకాలిక లీజుతో దేవదాయ భూములు అన్యాక్రాంతం

విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నాయుడు ఆరోపణ

అనకాపల్లి: జీవో నంబర్ 139 ప్రకారం దేవదాయ శాఖ భూములు ప్రైవేట్ వ్యక్తులకు దీర్ఘకాలిక లీజుకిస్తే అన్యాక్రాంతం అవుతాయని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు డి.డి.నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. అర్బన్ ప్రాంతాల్లో ఆలయ భూమిని 33 సంవత్సరాలు వరకు చారిటబుల్ ట్రస్టులకు పబ్లిక్ ఆక్షన్ లేకుండా రీజనబుల్ లీజుకు ఇవ్వడం సరికాదన్నారు. ఇది గతంలో 11 సంవత్సరాలు ఉండేదన్నారు. భూమి ఒకసారి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తే అక్రమాలు జరిగాక తిరిగి ఎండోమెంట్స్ శాఖ స్వాధీనం చేసుకోవడం కష్టతరమవుతుందన్నారు. కోర్టులు, కొన్ని సాంకేతిక సమస్యలు, జాప్యాలు, తలెత్తుతున్న ఇబ్బందులు అధిగమించలేని స్థితి నెలకొంటుందన్నారు. ఇప్పటికే లీజుదారుల ఆక్రమణల నుంచి దేవాలయ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఎన్నో న్యాయ పోరాటాలు చేస్తుందని వాపోయారు. 1987 ఎండోమెంట్ యాక్ట్‌లో నిర్వహించబడ్డ చారిటీ కార్యకలాపాలు చేసే ట్రస్టులకు ఈ స్థలాలు లీజుకు ఇస్తామని జీవోలో ప్రస్తావించారన్నారు. ఆ సెక్షన్‌లో హిందూ మత విశ్వాసాల పట్ల నిబద్ధత ఉండడం అనే ప్రస్తావన లేదన్నారు. అన్యమత సంస్థలు కూడా చారిటీ పేరున అడిగే అవకాశం ఉందన్నారు. దాతలు హిందూ మత సంబంధిత ఆశయంతో ఒక నిర్దిష్ట దేవాలయానికి దానం చేసిన ఆస్తిని వేరొకరికి దీర్ఘకాలం లీజుకు ఇచ్చేయడం అన్యాయమన్నారు. హిందువుల దేవాలయాల ఆస్తులకు సంబంధించిన ఇటువంటి కీలక విషయాల్లో ఏకపక్ష నిర్ణయ విధానం సరికాదన్నారు.

నటుడిగా కొనసాగడమే ధ్యేయం

సినీ, టీవీ, నాటక రంగ కళాకారుడు గోపరాజు విజయ్



కశింకోట: జీవితాంతం నటునిగా కొనసాగడమే తన ధ్యేయమని సినీ నటుడు, టీవీ, నాటక రంగ కళాకారుడు గోపరాజు విజయ్ అన్నారు. కశింకోటలో తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీల్లో భాగంగా 'జనరల్ బోగీలు'నాటిక ప్రదర్శనకు వచ్చిన సందర్భంగా శనివారం రాత్రి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన తాను ఒక వైపు సినిమా నటునిగా, మరో వైపు నాటక రంగ కళాకారునిగా కొనసాగుతున్నానన్నారు. నాటక రంగం నుంచే నట జీవితాన్ని ప్రారంభించానన్నారు. నాటక, సినిమా రంగాలు రెండు కళ్లులాంటివన్నారు. పలు టీవీ సీరియల్స్‌లో కూడా నటించానని చెప్పారు. తన తండ్రి గోపరాజు రమణ రంగ స్థల, టీవీ, సినిమా నటునిగా గుర్తింపు పొందారన్నారు. ఆయన వారసునిగా ప్రవేశించి 36 ఏళ్లగా నటునిగా కొనసాగుతున్నానన్నారు. ఇప్పటికి 20 వరకు సినిమాల్లో నటించానన్నారు. సత్యనారాయణస్వామి మహాత్మ్యం సినిమాతో సినీ రంగ ప్రవేశం చేశానని వివరించారు. తాజాగా సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో సర్పంచ్‌గా నటించానన్నారు. భీమ్లా నాయక్, ఎఫ్–3, తదితర చిత్రాలు తనకు గుర్తింపు తెచ్చాయన్నారు. సామజవరగమన, గుంటూరు కారం, వినరో భాగ్య విష్ణు కథ, తదితర చిత్రాల్లో నటించానన్నారు. ఉత్తమ కళాకారునిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి 13 నంది పురస్కారాలు, కందుకూరి పురస్కారం అందుకున్నట్టు విజయ్ తెలిపారు.



జనరల్ బోగీలు నాటికలో ఎస్‌ఐగా గోపరాజు విజయ్

ఆటో డ్రైవర్ నిజాయితీ

రావికమతం: పోగొట్టుకున్న బంగారు ఆభరణం తిరిగి ఇచ్చిన ఆటోడ్రైవర్ శ్రీనివాస్ నిజాయితీని పలువురు అభినందించారు. కొత్తకోట శాంతి యూనియన్ సభ్యుడు, కొత్తకోట గ్రామానికి చెందిన కొప్పు శ్రీనివాస్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ప్రతి రోజు కొత్తకోట నుంచి నర్సీపట్నం ప్రయాణికులను తీసుకెళ్లి వస్తుంటారు. 16 రోజుల క్రితం నర్సీపట్నం నుంచి కొత్తకోటకు ప్రయాణికులను తీసుకెళ్లే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బంగారం లాకెట్‌ను ఆటోలో జారవిడుకున్నాడు. చివరలో ఆటో డ్రైవర్ శ్రీనివాస్ బంగారం లాకెట్టును గుర్తించి తన వద్ద ఉంచుకున్నాడు. దీనిపై విచారణ అనంతరం చెట్టుపల్లి గ్రామానికి చెందిన విద్యార్థినిగా నిర్ధారించుకున్నాడు. ఆమె గుంటూరులో చదువుతుండడంతో ఆదివారం యూనియన్ సభ్యులు ఆధ్వర్యంలో ఆమె తండ్రి రాముకు కొత్తకోటలో లాకెట్‌ను అందజేశారు.



పోగొట్టుకున్న వ్యక్తికి బంగారం అందిస్తున్న ఆటో డ్రైవర్ శ్రీనివాస్

మహిళల వ్యధా జీవనమే 'శిథిల జీవి'



శిథిల జీవి నాటికలో ఓ సన్నివేశం

కశింకోట: పేద మహిళలు కుటుంబ జీవనం కోసం ధన సంపాదనకు విదేశాలు వెళ్లి చాకిరీ చేసి మోసపోతూ విగత జీవులుగా స్వదేశానికి చేరుతుండటం ఇతి వృత్తంగా 'శిథిల జీవి' నాటిక సాగింది. కశింకోటలోని గవరపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి దీన్ని ప్రదర్శించారు. ఇది ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. నాటిక మధ్యలో వర్షం కురిసి ప్రదర్శనకు దాదాపు అర్ధగంట పాటు అంత రాయం కలిగింది. ఆ తర్వాత కూడా మిగిలి ఉన్న నాటికను ప్రదర్శించాలని ఆహూతులు ఒత్తిడి చేశారు. దీంతో వాయిదా వేయాలని భావించిన కళాకారులు మిగిలిన నాటికను రసవత్తరంగా పూర్తి చేశారు. ఆహూతులు నాటికను వర్షం పడి అంతరాయం కలిగినా లెక్క చేయకుండా ఆద్యంతం వీక్షించి ఇంటి ముఖం పట్టారు.

కశింకోట: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన రంప విప్లవ వీరుడు 'ద్వారబంధాల చంద్రయ్యనాయుడు' నాటిక ఆహూతులను రంజింపజేసింది. మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు నాలుగు దశాబ్దాల పూర్వమే ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాడి తాడిత పీడిత, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచి బ్రిటిష్ వారికి, జమీందార్లకు చంద్రయ్య సింహ స్వప్నంగా మారుతాడు. అతడిని భోజనానికి పిలిచి అందులో మత్తు మందు కలిపి స్పృహలో లేకుండా చేసిన తర్వాత కిర్లంపూడి రోడ్లపై చిత్ర హింసలకు గురి చేసి చెట్టుకు కట్టి వేలాడదీసి చంపుతోంది. ఇది ఇతివృత్తంగా నాటికను ఆద్యంతం రక్తి కట్టించి ఆహూతులను అలరించింది. ఎక్కువ సంఖ్యలో కళాకారులు నాటికలో ప్రదర్శన నిర్వహించారు.



అధికంగా హాజరైన మహిళలు



అనగనగా ఒక రోజు నాటికలో సన్నివేశం



ద్వారబంధాల చంద్రయ్యనాయుడు నాటికలో సన్నివేశం

అలరించిన అనగనగా ఒక రోజు...

విశాఖపట్నం జ్యోతి సరళ స్మారక కళాపరిషత్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు రచించిన 'అనగనగా ఒక రోజు' నాటిక చివరి ప్రదర్శన ఆహూతులను అలరించింది. రాజు దయా దాక్షిణ్యాలపై బతికే ప్రజలు అరాచక పాలనను ఎలా అంతం చేయాలో తెలియని అయోమయ పరిస్థితిని ఎదురుకుంటారు. అనుకోకుండా ఊహించని రీతిలో రాజు అవినీతిని అంతం చేస్తున్న సమయంలో అతని అంగ రక్షకులే చిత్ర వధ చేసి రాజ సింహాసనాన్ని ఆక్రమించి అధిష్టిస్తారు. అవినీతిని పునః ప్రతిష్ట చేస్తే అప్పుడు ధర్మం ఎన్ని పాదాలపై నడుస్తున్నట్లు? ఒకటా? రెండా? మూడా? నాలుగా? అని ప్రశ్నించడం నాటిక కథాంశం.

నాణెం.. చరిత్రకు సాక్ష్యం



రంగూరి గిరిధర్

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు చిట్టివలసకు చెందిన రంగూరి గిరిధర్ ఇంట కాలచక్రంలో కరిగిపోని ఓ అపురూప నిధి ఉంది. అది బంగారం, వజ్రాలు కాదు.. వందలాది పాతకాలపు నాణేలు, పదుల సంఖ్యలో అప్పటి కరెన్సీ నోట్లు! అవును.. ఇవి చరిత్రకు సజీవ సాక్ష్యాలు. గిరిధర్ వద్ద భద్రంగా ఉన్న ఈ నాణేలన్నీ ఒకప్పటి మన జీవన విధానానికి, ఆర్థిక వ్యవస్థకు అద్దం పడతాయి. వీటిలో అణా, ఒక పైసా, రెండు పైసలు, మూడు పైసలు, ఐదు పైసలు, ఇరవై, ఇరవై ఐదు, యాభై పైసల నాణేలున్నాయి. ఆనాటి అవసరాలకు అనుగుణంగా అల్యూమినియం, ఇత్తడి, కంచు వంటి లోహాలతో తయారైన ఈ నాణేలు చూడటానికి చిన్నవే అయినా.. అవి మోసుకొచ్చిన చరిత్ర ఆసక్తికరం. ఈ నాణేలు ఇప్పుడు చలామణిలో లేకపోవచ్చు. కానీ వాటి విలువ ఏమాత్రం తగ్గలేదని గిరిధర్ చెబుతున్నారు. నిజమే.. వీటి చారిత్రక, సాంస్కృతిక విలువ వెలకట్టలేనిది. పూర్వం చాలా మంది ఇలాంటి పాత నాణేలను ఇచ్చి వెండి వస్తువులు కొనుగోలు చేసేవారని, ఆ లెక్కన చూసుకున్నా ఇప్పటికీ ఈ లోహపు నాణేలకు విలువ ఉంటుందని కొందరు అంటుంటారు. కానీ గిరిధర్ కుటుంబానికి మాత్రం ఈ నాణేలను అలా మార్చుకోవడం ఇష్టం లేదు. వీటిని చూస్తూ మురిసిపోతుంటుంది.

నాణేల వెనుక కథలు..

ఈ నాణేల వెనుక ఉన్న కథలను, అప్పటి వాటి కొనుగోలు శక్తిని తన తల్లిదండ్రులు అరుణకుమారి, ప్రసాదరావు వివరిస్తుండేవారని గిరిధర్ చెబుతున్నారు. ఒక అణాతో ఏమేమి కొనుగోల చేశాం? ఒక పైసా విలువ ఎలా ఉండేది? వంటి విషయాలు వారి మాటల్లో వింటుంటే ఆ కాలంలోకే వెళ్లినట్టు అనిపించేదని గుర్తు చేసుకుంటారు. ఇప్పుడు గిరిధర్ కూడా తన తర్వాతి తరాలకు ఈ నాణేలను చూపిస్తూ.. వాటి గొప్పతనాన్ని, మన పూర్వీకుల జీవన విధానాన్ని వివరిస్తున్నారు. ఈ నాణేల చప్పుడులో ఒకప్పటి చరిత్ర ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది.



ఇత్తడితో తయారు చేసిన 20 పైసల నాణేలు



రెండు రకాల మెటల్‌తో తయారైన 10 పైసల నాణేలు

సాక్షి క్లాసిఫైడ్స్



BEAUTY PARLOR FOR SALE

■ డైమండ్ పార్క్ బెంజ్ కృష్ణా హోటల్ వెనుక మంచి రన్నింగ్ కండీషన్‌లో ఉన్న సెలెన్ బ్యూటీ పార్లర్ & స్పా అన్ని వసతులతో అమ్మకమునకు కలదు. సంప్ర॥ 95736 66794. [V- 0066]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13756]



■ మీరు ఉన్నచోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. పార్ట్ / ఫుల్ టైం 100% ఎటువంటి ఫీజులు ఉండవు. ఫోన్: 97015 05819 [SCA25003988]

■ మీరు వృధా చేసే టైంలో మీ ఇంటి వద్ద లేదా ఆఫీసులో కూర్చుని సాలరీ+ కమీషన్ పద్ధతిలో వర్క్ చేయుటకు కావలెను గాజువాక పరిసర ప్రాంతాల వారికి ప్రత్యేక అవకాశం సెల్ : 73867 09339 [SCA25004122]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం: 18k. Ph: 9640258899, 9640468899 [HA-1909]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	:9010546644
యలమంచిలి	:9951602901
చోడవరం	:9010210265
నర్సీపట్నం	:9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

కొనసాగుతున్న ఆర్టీసీ ఉద్యోగుల దీక్షలు



దీక్షలు చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అనకాపల్లి: ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్మికులు స్థానిక డిపో వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు ఆదివారం 86వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ సర్క్యులర్ నంబర్.1/2013 అమలు చేయాలని, అధికారులు కార్మికులకు లక్షల్లో ఇస్తున్న పనిష్మెంట్ విధానాలు నిలుపుదల చేయాలని, డిపోలో విధుల నుంచి తొలగించిన కండక్టర్ ఎస్ఎస్ నారాయణన్ని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని తదితర డిమాండ్లు చేశారు. రిలే నిరాహార దీక్షలో ఉద్యోగులు ఎ.రమణ, డి.ఆనంద్, జి.ఎస్.రావు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉచిత వైద్య పరీక్షలు



పూడిమడకలో ప్రజలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

అచ్యుతాపురం రూరల్ : మెరైన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామామైన పూడిమడకలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ(మెరైన్) జి.మధుసూదన్‌రావు పర్యవేక్షణలో వైద్యులు రామకార్తిక్, క్రాంతి కుమార్ గ్రామస్తులకు చికిత్స చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పూడిమడక మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ ఎస్.సింహాద్రినాయుడు, ఎస్ఐ జి.పైడిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను గౌరవిస్తేనే మేలు



గోకులపాడులో మహిళా రైతులను సత్కరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ఎస్.రాయవరం: దేశానికి వెన్నుముకగా నిలిచే రైతులను గౌరవించినప్పుడే అన్ని వర్గాల వారికి మేలు చేకూరుతోందని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కర్రి సత్యనారాయణ అన్నారు. గోకులపాడు ఏజే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగంబోయిన నాని పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అడ్డురోడ్డు బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రూ.లక్ష వ్యయంతో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భవనాలు వద్ద పలు మొక్కలు నాటారు. పలువురు మహిళా రైతులను సత్కరించారు.

దేవరాపల్లిలో భారీ వర్షం

దేవరాపల్లి: దేవరాపల్లిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కారుమబ్బులు కమ్మేయడంతో ఉక్కపోత ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో వాతావరణం కూల్‌కూల్‌గా మారింది. దీంతో ప్రజలు ఉక్కపోత నుంచి కాస్తా ఉపశమనం పొందారు. భారీ వర్షం ధాటికి ప్రధాన రహదారులన్నీ వర్షపునీటితో నిండిపోయాయి.

అనకాపల్లి సినిమాలు

నిశ్శబ్ద ప్రేమ : రాజా
శుభం : సత్యనారాయణస్క్రీన్-1
లవ్‌లీ : సత్యనారాయణ స్క్రీన్-2 (1, 2 షోలు)
సత్యనారాయణ స్క్రీన్-2 : శుభం, (ఉదయం, మధ్యాహ్నం)
హిట్-3 : పర్తిసాయి
సింగిల్ : షిర్డీసాయి
ఏసీఈ : వెంకటేశ్వర
వర్షం : శ్రీసత్య
ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్‌లైన్స్ : రామచంద్ర

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 211 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 197 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరు సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-13 యూనిట్లు, బీ పాజిటివ్-12, ఓ పాజిటివ్-12, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

కేజీబీవీకి అదనపు భవనం

- రూ.1.60 కోట్లతో పనులు ప్రారంభం
- ఇంటర్ విద్యార్థినులకు తీరనున్న సమస్య



కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం



తేగాడ కేజీబీవీలో తరగతి, డార్మెంటరీ భవన నిర్మాణం



కశింకోట: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న తేగాడ కేజీబీవీలో అరకొర వసతులతో విద్యార్థినులు నెట్టుకొస్తున్నారు. త్వరలో వీరి కష్టాలకు మోక్షం కలగనుంది. ఇక్కడ ఇంటర్మీడియట్ విద్యార్థినుల కోసం నూతనంగా వేరుగా భవన నిర్మాణం చేపడుతున్నారు. ఇందుకోసం రూ.1.60 కోట్లు సర్వశిక్షా అభియాన్ నిధులు మంజూరయ్యాయి. దీంతో ఆరు గదులను నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహించడానికి గదులు లేవు. చాలీచాలని హైస్కూలు స్థాయి గదుల్లోనే ఐదేళ్లుగా నెట్టుకొస్తున్నారు. 2011 తేగాడలో కస్తూర్బాగాంధీ పాఠశాలను కశింకోట నుంచి మార్పు చేసి నిర్వహిస్తున్నారు. 280 మంది బాలికలు చదువుతున్నారు. దీనిలో అనాథలు, మధ్యలో స్కూలు మాని వేసిన వారు, వెనుకబడిన తరగతుల వారు, ఇతరులు చదువుకోవడానికి అవకాశం కల్పించారు. 2020 కొత్తగా ఇంటర్ బైపీసీ కోర్సును ప్రవేశ పెట్టి నిర్వహిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో చెరో 40 వంతున సీట్లు ఉన్నాయి. ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నారు. వీరికి దీనిలోనే భోజనం, వసతి సదుపాయం అందిస్తున్నారు.

ఏటా ఉత్తమ ఫలితాలు..

ఇక్కడ ఏటా బాలికలు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్‌లో రాష్ట్ర స్థాయి కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో విద్యార్థి కె. రాజులమ్మ 983 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. అయితే పాఠశాలలో పూర్తి స్థాయిలో ఇంటర్మీడియట్ నిర్వహణకు సదుపాయాలు లేవు. చాలీచాలని తరగతి గదుల్లోను, డార్మెంటరీల్లోను బోధన నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం విద్యాలయంలో 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. వీరికి మూడు డార్మెంటరీలు, ఐదు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ఇవి సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో వీరి కోసం ప్రత్యేకంగా ఆరు గదులు, డార్మెంటరీ నిర్మాణానికి రూ.1.60 కోట్లు సర్వశిక్ష అభియాన్ నుంచి మంజూరు కావడంతో టెండర్లు పిలిచి ఖరారు చేయడంతో కాంట్రాక్టర్ పనులను చేపట్టారు. దీనిలో రెండు అంతస్తులుగా రెండు తరగతి గదులకు, నాలుగు డార్మెంటరీ గదులు నిర్మించనున్నారు. వీటిలో రెండు తరగతులు, రెండు డార్మెంటరీలను ఇంటర్మీడియట్‌కు, మరో రెండు డార్మెంటరీలను 9, 10 తరగతుల బాలికలకు కేటాయించనున్నారు. వీటి నిర్మాణం పూర్తయితే గదులు, డార్మెంటరీలు కొరత తీరనుంది. వీటితోపాటు అదనంగా ఇప్పటికే కంప్యూటర్ ల్యాబ్‌ను రూ.18.50 లక్షలు, లైబ్రరీ గదిని రూ.23 లక్షలతో నిర్మించి సౌకర్యాలను మెరుగుకు చర్యలు తీసుకుంటున్నారు.

విద్యార్థినులకు మరింత మెరుగ్గా సౌకర్యాలు

కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఇంటర్మీడియట్ కోసం ప్రత్యేకంగా ఆరు తరగతి గదులు, డార్మెంటరీల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే రూ.41 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ గదులను నిర్మించారు. దీంతో విద్యార్థినులకు సౌకర్యాలు మరింతగా మెరుగుపడనున్నాయి.

– దొండా చంద్రకళ, ప్రిన్సిపాల్, కేజీబీవీ, తేగాడ

కళా రంగాన్ని ప్రోత్సహించడం అభినందనీయం



నాటికలను ప్రారంభించి మాట్లాడుతున్న పరమేశ్వరరావు

కశింకోట: కశింకోటలో కళా రంగాన్ని ప్రోత్సహిస్తూ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికలను నిర్వహించడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. స్థానిక గవరపేటలో ఆదివారం నిర్వహించిన నాటిక పోటీలను ప్రారంభించారు. నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ అధ్యక్షుడు బొడ్డేడ బలరామస్వామి, ఉపాధ్యక్షుడు ఆళ్ల మహాలక్ష్మినాయుడు, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి దేవినాయుడు, నాటక న్యాయ నిర్ణేత భీమరశెట్టి వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నాటికలకు ఆదరణ



హాజరైన ప్రజలు, కళాభిమానులు



జనరల్ బోగీలు నాటికలో సినీ,నాటక, సీరియల్ నటుడు గోపరాజ్ విజయ్

కశింకోట: ఉభయ రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ఆహూతులను విశేషంగా అలరిస్తున్నాయి. వాస్తవికతకు చేరువగా ప్రజలతో మమేకమయ్యే కథాంశాల మేళవింపుతో ప్రదర్శనలు నిర్వహిస్తే, నాటిక రంగానికి ఆదరణ ఎప్పుడూ ఉంటుందని ఈ పోటీలు నిరూపించాయి. అర్ధరాత్రి దాటే వరకు పిల్లలు మొదలుకొని పెద్దల వరకు, మహిళలు సైతం కదలకుండా ఆసక్తిగా ఆద్యంతం వీక్షించారు. వర్షానికి ప్రదర్శన ఆగిపోయినా తగ్గిన తర్వాత కళాకారులను ఒత్తిడి చేసి నాటిక పూర్తయ్యే వరకు వీక్షించడం విశేషం. స్థానికులే కాకుండా స్థానికేతరులు సైతం ఇతర గ్రామాల నుంచి నాటికలపై ఆసక్తితో వచ్చి వీక్షించారు. స్థానిక గవరపేటలో శారదానది తీరాన ఆహ్లాదకరమైన వాతావరణంలో అశోక్ ఫ్రెండ్స్ క్లబ్ సాంస్కృతిక కళా పరిషత్ నాటిక రంగానికి ప్రోత్సాహకంగా నాల్గో దఫా ఈ పోటీలను దాతలు, ప్రజల సహకారంతో నిర్వహించారు. ఈ నెల 22న ప్రారంభమైన పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. మొదటి, చివరి రోజు రెండేసి, మిగిలిన రెండు రోజుల్లో మూడేసి వంతున పది నాటికలు ప్రదర్శించారు. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు వచ్చి వీటిని ప్రదర్శించి ప్రజలను రంజింపజేశారు. సామాజిక అంశాలతో రూపొందిన నాటికలతోపాటు చారిత్రాత్మక నాటికలు ప్రదర్శించారు. సినిమాలు, టీవీ సీరియల్స్ ఉన్నా ప్రత్యక్షంగా కనుల ముందు తమ హావభావాలతో కళాకారుల నాటికల ప్రదర్శన వీక్షించి ఆదరించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పరవాడ: వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వారు చదువుకున్న పాఠశాలను వేదికగా చేసుకుని ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ చిన్ననాటి చిలిపి చేష్టలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం వారు స్థిరపడిన వృత్తులు, కుటుంబ విశేషాలను ఒకరికొకరు పంచుకున్నారు. ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు వెల్ఫేర్ గ్రూప్‌గా ఎవరికి ఏ కష్టమొచ్చినా.. సహకరిస్తూ ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించారు. పాఠశాల చదువులు వదిలి 30 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మిఠాయిలు పంచుకున్నారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనాలు చేసి, సందడిగా గడిపారు. ఫొటోలు తీసుకుని, జ్ఞాపకాలతో వెనుదిరిగారు.

ఉత్సాహంగా గుర్రపు పోటీలు



దౌడు తీస్తున్న గుర్రం



పూజలందుకున్న అభయాంజనేయస్వామి

ఎస్.రాయవరం: హనుమజ్జయంతిని పురస్కరించుకుని సైతారుపేటలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి గుర్రపు పందేలు ఉత్సాహంగా సాగాయి. గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సుమారు 15 మంది తమ గుర్రాలను స్వారీ చేస్తూ ఆకట్టుకున్నారు. ఇందులో అచ్యుతాపురం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన గుర్రపు స్వారీ దారుడు అప్పారావుకి ప్రథమ బహుమతి రాగా, చోడవరానికి చెందిన గుర్రానికి ద్వితీయ స్థానం లభించింది. తృతీయ, నాలుగో, ఐదో స్థానాల వారికి కూడా నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సహించారు. గుర్రపు పందేలు తిలకించేందుకు సైతారుపేట పరిసర ప్రాంతాలైన పేటసూదిపురం, వేమగిరి, సర్వసిద్ధి, జేపీపాలెం, ఎస్.రాయవరం తదితర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాత సత్యనారాయణకు బాండ్ అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మాధవధార ప్రాంతానికి చెందిన పి.ఉమా వెంకట సత్యనారాయణ లక్షా 5 రూపాయల విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయ డొనేషన్ కౌంటర్లో ఇచ్చారు. దేవస్థానం తరఫున అన్నప్రసాద విభాగం ఏఈవో ఆనంద్‌కుమార్, పీఆర్వో కార్యాలయ సూపరింటెండెంట్ విక్రమ్ దాతకు బాండ్ అందించారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

లక్ష్యంతో చదివితే భవిష్యత్



పదిలో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం

మునగపాక: లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు అన్నారు. ఇటీవల జరిగిన పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు ఇదే హైస్కూల్‌లో 1995-96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల పిల్లలను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో ఏకాగ్రత ఉండాలన్నారు. ఇష్టపడి, కష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సొంతమవుతాయన్నారు. హెచ్ఎం శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దేరులో పెరిగిన నీటిమట్టం

మాడుగుల : మండలంలో ఆదివారం సాయంకాలం భారీ వర్షం కురిసింది. దీంతో పెద్దేరు జలాశయం కేచ్ మెంట్ ఏరియాలో 26 మిల్లీ మీటరులు వర్షం పాతం నమోదయింది. జలాశయం గరిష్ట నీటి మట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 135 మీటర్లకు చేరుకుంది. పెద్దేరు ఆయకట్టు 15 వేల ఎకరాలకు సాగునీటికి ఢోకాలేదని, జలాశయం జేఈ సుధాకర్ రెడ్డి తెలిపారు.

తురాయి పూల సోయగం



కొరువాడ జగన్నాథపురం మార్గంలో తురాయి పూల స్వాగతం.

కె.కోటపాడు : మండలంలో కొరువాడ జగన్నాథపురం- ఆర్.వై.అగ్రహారం గ్రామాల మధ్య రోడ్లకు ఇరువైపులా ఉన్న తురాయి చెట్లు ఎరుపు రంగు పూలతో ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి. రెండు కిలో మీటర్ల పొడవు గల రోడ్డు మార్గంలో గల తురాయి చెట్లకు ఎరుపు రంగుతో పూలు వికసించడంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులను ఈ ప్రాంతం ఆకట్టుకుంటుంది. స్వాగతం పలికేలా తురాయి పూలు దర్శనమిస్తున్నాయి.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



సుందరయ్యపేటలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

అనకాపల్లి: దైవ జ్ఞానం ప్రకారం కులాలు అహేతుకమని, మతాలు నిషిద్ధమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. సుందరయ్యపేట, అచ్యుయ్యపేట గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధ గ్రంథాల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలన్నారు. మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలుగా విభజింపబడి ఉన్నాడని, జీవాత్మ, ఆత్మ, పరమాత్మల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అని పేర్కొన్నారు. భగవద్గీతలో కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలని, వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుంచి బయటపడేసి మనిషికి ముక్తిని ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విశాఖపట్నం కమిటీ సభ్యులు రమణ, నాగమణి, పద్మ, లక్ష్మి, త్రైత, సర్వధారి, దేవి, సత్యవతి, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



గవరపాలెం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్లో భక్తులు

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లా నుంచి, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి కుటుంబ సమేతంగా చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలో కొంతమంది భక్తులు శనివారం రాత్రి అమ్మవారి పాటను నిర్వహించి ఆదివారం తెల్లవారు జామున ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కుటుంబ సమేతంగా ఆలయం ఆవరణలో చలువ పందిళ్ల వద్ద వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో వెంపలి రాంబాబు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వృద్ధులు, బాలింతలు, చిన్నపిల్లలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తాగునీరు, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుదల



తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ డీఎస్పీ ఆనంద్

కశింకోట: విద్యార్థులు గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేసి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎక్సైజ్ డీఎస్పీ ఎ. ఆనంద్ కోరారు. మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించడానికి దోహదంగా నిలుస్తాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపైనా శ్రద్ధ చూపాలన్నారు. ఆటలు ఆడటంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. పెద్దలను గౌరవించాలన్నారు. నీతి, నిజాయితీతో మెలగాలన్నారు. క్రమశిక్షణ, దేశ భక్తి కలిగి ఉండాలన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా నీతికథల పుస్తకాలను చదివి వాటిలో సారాంశాన్ని వివరించారు. విద్యార్థులతో నీతి కథల పుస్తకాలను చదివించారు. గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

సాగరతీరంలో సండే సందడి



తిక్కవానిపాలెం దరి సముద్రంలో జలకాలాడుతున్న సందర్శకులు

పరవాడ: మండలంలోని తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు పర్యాటకులతో ఆదివారం సందడిగా మారాయి. వేసవి సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, పిల్లలు, పెద్దలు తీర ప్రాంతాలకు చేరుకుని సందడి చేశారు. వేసవి తాపం, వేడి గాలులతో ఉక్కపోతకు గురై ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉపశమనం పొందేందుకు తీర ప్రాంతాలకు చేరుకుని కెరటాలతో కేరింతలు కొట్టారు. సముద్ర స్నానాలకు వెళ్లలేని వారు తీరం వెంబడి చెట్లు, వంతెనల కింద సేదదీరారు. సాయం సంధ్య వరకు ఇసుక తిన్నెలపై ఆట పాటలతో ఆనందంగా గడిపారు.

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



బ్లడ్ డొనేషన్ చేసిన వారికి సర్టిఫికేట్లు అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం : వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మిని స్టేడియంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఎస్పీ పి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. 50 ఏళ్ల పైబడిన సుమారు 40 మంది క్లబ్ సభ్యులు రక్తదానం చేయడానికి ముందుకు వచ్చి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. వేసవిలో బ్లడ్ బ్యాంకుల్లో రక్తం కొరత ఎక్కువగా ఉంటుందని, ఇటువంటి సందర్భంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం విశేషం అన్నారు. ప్లాస్టిక్ నిషేధం కోసం క్లబ్ చేస్తున్న కృషి చేస్తున్నారని, ప్లాస్టిక్ ప్లేట్స్, గ్లాసులు వాడకుండా ప్రత్యేకంగా స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవటం శుభపరిణామన్నారు. అనంతరం బ్లడ్ డొనేషన్ చేసిన వారికి డీఎస్పీ సర్టిఫికేట్లు అందజేశారు.

